నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, మంగళవారం 19 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

మాంగళ్యధారణ గావిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి వివాహ మహోత్సవం

పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

శ్రీరామలంకార సేవలో హనుమంత వాహనంపై ఊరేగిన స్వామివారు

యాదగిరిగుట్ట, మార్చి18 : యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కొండపైన లక్ష్మీనరసింహ స్వామి తిరు కల్యాణోత్సవాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. దేవదేవుడితో మహాలక్ష్మి అమ్మవారి కమనీయ వివాహ వేడుకను భక్తజనులు కనులారా వీక్షించి తరించారు. రాత్రి 8.45 గంటలకు స్వయంభూ ప్రధానాలయ ఉత్తర మాఢవీధుల్లో నెలకొల్పిన ప్రత్యేక కల్యాణ వేదికపై వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతు వైభవంగా సాగింది. ముక్కోటి దేవతలు అహుతులుగా, చతుర్ముఖ బ్రహ్మాది దేవతల సమక్షంలో యాదగిరి నృసింహస్వామి లోక కల్యాణార్థం సముద్ర తనయ మహాలక్ష్మి అమ్మవారి మెడలో రాత్రి 11 గంటలకు తులాలగ్న సుముహూర్తంలో మాంగళ్యధారణ చేశారు. పట్టువస్త్రాలు, స్వర్ణ, వజ్ర వైఢూర్యాలు, ముత్యాల ఆభరణాలతో నవ వరుడిగా అలంకృతుడైన లోక కల్యాణ కారకుడు నరసింహస్వామి గజవాహనంపై మండపానికి ఊరేగింపుగా రాగా, భక్త జనకోటికి సకల సంపదలను ప్రసాదించే మహాలక్ష్మి అమ్మవారు పుష్పాల పల్లకిలో ఉత్తర మాఢవీధుల్లో నిర్మించిన బ్రహ్మోత్సవ మండపంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. భక్త జనుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, పారాయణందారులు ఊరేగింపుగా మండల వేదిక వద్దకు చేరిన స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపంపై అధిష్టింపజేశారు. లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేడుకలను పాంచరాత్రాగమశాస్త్రం రీతిలో దేవతల సైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడికి తొలిపూజలతో శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లకు రక్షాసూత్ర ధారణ చేసిన అర్చకులు వేద ప్రాశస్త్యమైన మంత్రోచ్ఛారణలతో స్వామివారికి యజ్ఞోపవీతధారణ నిర్వహించారు. దేవదేవుడు నరసింహ స్వామికి లక్ష్మి అమ్మవారి తండ్రి సముద్రుడు పాద ప్రక్షాళన చేసిన అనంతరం కన్యాదాన తంతును చేపట్టారు. వధూవరులు నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం అలంకరించే కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని ప్రధానార్చకులు నల్లన్‌ధీఘశ్ లక్ష్మీ నరసింహాచార్యులు నిర్వహించారు.


శ్రీరామ అలంకారంలో స్వామి వారు

శ్రీరామ అలంకార సేవ

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం లక్ష్మీనరసింస్వామిని శ్రీరామ అలంకరణలో తీర్చిదిద్ది హనుమంత వాహనంపై వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. పశ్చిమ రాజగోపురం నుంచి ఉత్తర, తూర్పు, దక్షిణ మాఢవీధుల్లో తిరుగుతూ భక్తులను దర్శనమిచ్చారు. జయజరామ.. జానకి రామ అంటూ భక్తులు దర్శించుకుని తన్మయత్వం పొందారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధానార్చకులు నల్లన్‌ధీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు నారసింహుడిని శ్రీరాముడి సేవ విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రమేశ్‌బాబు, రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా మాఢ వీధులు

లక్ష్మీనరసింహ స్వామి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ప్రధానాలయ తిరుమాఢ వీధులు కిక్కిరిసిపోయాయి. గోవిందా గోవిందా అంటూ భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


పిల్లన గ్రోవితో వేణుగానం

నేడు దివ్య విమాన రథోత్సవం

గుట్ట బ్రహ్మోత్సవాల్లో 9వ రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీమహావిష్ణు అలంకారంలో గరుఢ వాహనంపై కల్యాణమూర్తి లక్ష్మీనరసింహ స్వామి దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 8.45 గంటలకు దివ్య విమాన రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ప్రధానాలయ తిరు మాఢవీధుల్లో రథంపై ఊరేగుతూ స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం శ్రీ వైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభార భేరి, శ్రీనివాస్ అండ్ పార్టీ, శ్రీశంకర మహిళా భజన మండలి, ఖమ్మానికి చెందిన శ్రీకృష్ణ బృందం వారిచే భజన, మైలవరపు శ్రీనివాస్‌రావు ఉపన్యాసం, ముదపాక బాల సుందరం భాగవతార్ వారి హరికథ నిర్వహించారు. సాయంత్రం నూకల జగదీశ్వరి, భక్తి రంజని, శ్రీగోదా నరసింహారావు వారి భక్తి సంగీతం, ఊర్జిత ఉమాకాంత్ రావు కర్ణాటక సంగీతం, జయప్రదా రామ్మూర్తి వారి వేణుగాన కచేరి భక్తులను కట్టిపడేశాయి.

కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు

స్వామి వారికి పట్టువస్త్రాలు

స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సభ్యులతో.. ఆలయం తరపున ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు సమర్పించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల స్థానంలో వారు అధికారికంగా అందజేశారు. కల్యాణోత్సవంలో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతోపాటు జిల్లా కోర్టు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ తంతు జరిగిందిలా...

08.47 గంటలకు ఉత్తర మాఢవీధుల్లోకి గజవాహనంపై స్వామి, ప్రత్యేక పల్లకిపై అమ్మవారు ఊరేగింపు
08.50 గంటలకు కల్యాణ మండపంపైకి స్వామి, అమ్మవారు
09.04 గంటలకు స్వామి, అమ్మవార్లకు హారతినిచ్చిన అర్చకులు
10.06 గంటలకు స్వామి, అమ్మవార్లకు రక్షబంధన్ గావించిన అర్చకులు
10.12 గంటలకు స్వామివారికి యజ్ఞోపవీతధారణ
10.27 గంటలకు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన ప్రధానార్చకులు
10.53 గంటలకు జీలకర్ర బెల్లం సమర్పణ
11.00 గంటలకు మాంగళ్యధారణ గావించిన ప్రధానార్చకులు
11.03 గంటలకు స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు సమర్పణ


కల్యాణోత్సవంలో పాల్గొన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ అర్చకులు, అధికారులు

నల్లగొండ మండలం అన్నెపర్తిలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తూ మహిళా రైతు చంద్రమ్మతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎండిపోతున్న పంటలతో తల్లడిల్లుతున్న రైతులు

- సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- జిల్లా మంత్రికి వసూళ్ల మీద ఉన్న సోయి రైతుల సమస్యలపై లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- అన్నెపర్తిలో ఎండిన వరి పొలాల పరిశీలన

నల్లగొండ రూరల్, మార్చి 18 : రాష్ట్రంలో ఏ పల్లెకు వెళ్లినా నీళ్లు లేక ఎండిన పంట పొలాలు, తోటలు దర్శనమిస్తున్నాయని, పంటలు ఎండిపోయి రైతులు బోరున విలపిస్తున్నా అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ మండలంలోని అన్నెపర్తి గ్రామంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఎండిపోయిన పంట పొలాలు, నిమ్మ తోటలను పరిశీలించారు. పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్‌తో వరి పొలానికి నీరు అందిస్తున్న దృశ్యాలు చూశారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి పంటలకు పెట్టిన పెట్టుబడి, నీళ్లు, కరెంట్ తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు కింద సాగు నీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో కూడా ఎగువన ఉన్న నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్ నుంచి నీటిని తెప్పించి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలు ఎండిపోవడంతో పెట్టుబడులన్నీ మట్టిలో కలిసిపోయి రైతులు విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు కూడా ఎండిపోయిన పంట పొలాల వైపు కన్నెత్తి చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా మంత్రికి వసూళ్ల మీద ఉన్న సోయి రైతుల సమస్యల మీద లేదన్నారు. వ్యాపారులు, కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేసి సంపాదించుకునే పనిలో ఉన్నారు తప్ప, వంద రోజుల పరిపాలనలో ఒరిగిందేమీ లేదని చెప్పారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రగాల్భాలు పలుకడం తప్ప దేనికీ పనికి రారని ఎద్దేవా చేశారు. ఎంత సేపు రాజకీయాలు చేయడం తప్ప వారికి రైతుల సంక్షేమం పట్టదన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా బీఆర్ఎస్ సర్కారులో రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేశామని, సాగు నీరు అందించి ఎండుతున్న పంటలను కాపాడామని గుర్తు చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలు, రైతుల రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రతినిధులు కరువుపై సర్వే చేయించాలని, పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేప వెకంట్‌రెడ్డి, సీనియర్ నాయకులు బకరం వెంకన్న, తుమ్మల లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, ఘట్టయ్య, బడుపుల శంకర్, జంగయ్య, నారబోయిన భిక్షం, దేవేందర్, చీర పంకజ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నల్లగొండ మండలం అన్నెపర్తిలో ఎండిన వరిచేనులో మేస్తున్న పశువులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

విపత్తులపై సమగ్ర సమాచారాన్ని అందించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ఈ నెల చివరిలోగా సమాచారం అందించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర విపత్తుల సంస్థ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాతీయ విపత్తుల మేనేజ్‌మెంట్‌పై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ విపత్తులు ఏర్పడినప్పుడు ఎదుర్కొనే విధానాలపై జిల్లా విపత్తుల మేనేజ్‌మెంట్ యాక్ట్ 2005, రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రణాళిక ప్రకారం జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖలు సమగ్ర సమాచారం ఈ నెల చివరిలోపు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్ షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గూడ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ గౌతమ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి పోతరాజు రజినీ రాజీనామా

తిరుమలగిరి, మార్చి 18 : తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోతరాజు రజినీ తన పదవికి రాజీనామా చేశారు. కలెక్టర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేసినట్లు సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తిరుమలగిరి మున్సిపాలిటీలోని 5వ వార్డు నుంచి పోతరాజు రజినీ గెలిచి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతోపాటు బీఆర్ఎస్‌కు చెందిన మరికొంత మంది కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాస తీర్మానం కోరుతూ గతంలో కలెక్టర్‌కు పత్రాన్ని అందజేశారు. ఈ నెల 20న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్న తరుణంలో మన స్థాపం చెంది తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజీ దేశ, విదేశాలకు చెందిన 16 మంది సభ్యుల బృందం మేజర్ జనరల్ ఏకే సింగ్ ఆధ్వర్యంలో సోమవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నది. స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఈ బృందానికి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎ.భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, అధికారులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్న నేషనల్ డిఫెన్స్ కాలేజీ సభ్యులు

కోతులు చుట్టుముట్టడంతో బిల్డింగ్ పైనుంచి దూకిన విద్యార్థిని

- తృటిలో తప్పిన పెను ప్రమాదం

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : పదో తరగతి పరీక్షల కోసం పాఠశాల పై అంతస్తులో గదిలోకి వెళ్తుండగా కోతులు చుట్టుముట్టడంతో విద్యార్థిని కిందికి దూకింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పోచంపల్లి పట్టణంలోని గౌతమి హైస్కూల్‌కు చెందిన మనోజ్ఞ (15) సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో వార్షిక పరీక్షలు రాసేందుకు వెళ్లింది. పాఠశాల బిల్డింగ్ పై అంతస్తులో తన నెంబర్ ఉండగా వెళ్తుండగా ఒక్కసారిగా మూడు కోతులు చుట్టుముట్టి కరువడానికి ప్రయత్నించాయి. భయంతో బిల్డింగ్ పైనుంచి కిందికి దూకింది. విద్యార్థినికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అక్కడున్న సిబ్బంది, పోలీసులు కోతులను తరిమికొట్టారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. ఆలస్యంగా వైద్య సిబ్బంది పరీక్ష కేంద్రానికి వచ్చి పరీక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థినికి మంచి నీరు అందించి ధైర్యం చెప్పడంతో ఆమె పరీక్ష రాసింది.

కిందపడిన విద్యార్థిని పైకి లేపుతున్న సిబ్బంది

ఆత్మకూర్ (ఎం)లో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

సజావుగా టెన్త్ ఎగ్జామ్స్

- తొలిరోజు 25 మంది విద్యార్థులు గైర్హాజరు

భువనగిరి అర్బన్, మార్చి 18 : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు 51 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 9,159 మంది విద్యార్థులకు 9,134 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సరళిని డీఈఓ కె.నారాయణరెడ్డి పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 9:30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 5 నిమిషాల వెసులుబాటు కల్పించి విద్యార్థులను అనుమతించారు.

వలిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు